క్లుప్తంగా

ఓట్లొస్తేనే గుర్తొస్తామా సారూ

- నెల్లూరులో నారాయణను నిలదీసిన ప్రజలు

నెల్లూరు సిటీ: ఓట్లొస్తేనే తాము గుర్తొస్తామా..కరోనా సమయంలో తమరు ఎట్టబోయారు సారూ..అప్పుడు మేం గుర్తుకురాలేదా అంటూ మాజీ మంత్రి పీ నారాయణను నగర ప్రజలు నిలదీశారు. ఆదివారం రాత్రి నగరంలోని మూలాపేట ప్రాంతంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా నారాయణ పర్యటించారు. ప్రజలకు అభివాదం చేస్తుండగా స్థానికులు అయ్యగారు బాగున్నారా..నమస్కారం సారూ..చాలారోజుల తర్వాత వచ్చారు. కరోనా సమయంలో తమరు ఎట్టబోయారు సారూ.. తాము ఆస్పత్రికి వచ్చి చాలా ఇబ్బందులు పడ్డాం..మీ కోసం పనిచేశాం..కనీసం మమ్మల్ని చూసే దిక్కులేదా అంటూ నిలదీశారు. స్థానికులకు సమాధానం చెప్పలేక నారాయణ మొహం చాటేసే ప్రయత్నం చేయగా, మళ్లీ ఎప్పుడొస్తారూ సారు..ఓట్లప్పుడే గుర్తొస్తామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న నారాయణ అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

పోలీసు జీపును ఢీకొన్న లారీ

- ఇద్దరు ఎస్సైలు, డ్రైవర్‌కు గాయాలు

ఆత్మకూరు: పోలీసు జీపును వెనుకగా లారీ ఢీకొనడంతో ఇద్దరు ఎస్సైలు, జీపు డ్రైవర్ గాయపడ్డారు. ఈ ఘటన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..ఏఎస్‌పేట ఎస్సై నరేష్, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి పోలీసు శిక్షణ నిమిత్తం ఏలూరుకు వెళ్లారు. శిక్షణ ముగించుకుని వస్తూ నెల్లూరులో రైలు దిగి పోలీసు జీపులో ఆత్మకూరు బయలుదేరారు. మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలోని దాబా వద్ద నెల్లూరు–ముంబయి రహదారి పక్కన పోలీసు జీపును నిలిపి ఉండగా, వెనుకగా వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో జీపు పక్కనే ఉన్న చెట్లల్లోకి దూసుకుపోయింది. జీపులోని ఇద్దరు ఎస్సైలతో పాటు డ్రైవర్ రమణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆత్మకూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌పేట ఎస్సై నరేష్‌కు తీవ్రగాయాలు కావడంతో నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ జీ వేణు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ నెల్లూరు నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ సెక్రటరీ రామ్‌ప్రసాద్‌ను సత్కరించారు. దర్గామిట్టలోని నిర్మల సౌధలో అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్‌రెడ్డి, చైర్మన్ రమణారెడ్డి, సీనియర్ జాయింట్ సెక్రటరీ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


గురవయ్యకు పురస్కార ప్రదానం



నెల్లూరు(బృందావనం): అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి సంగీత ప్రియుల మదిని దోచుకున్న గుండాల గురవయ్య సేవలను టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణ యోగ మందిర ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ సర్వేపల్లి అజయకుమార్ కొనియాడారు. గుండాల గురవయ్యను అపర అన్నమయ్య బిరుదుతో ఆదివారం సత్కరించారు. పురమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సాయిదర్బార్ అద్దాల మందిర గౌరవ సలహాదారు పాటోలు రామసుబ్బారావు, వీరిశెట్టి హజరత్‌బాబు, హాస్య నటుడు దొర్నాల హరిబాబు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 118
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 200



అవ్వా తాతా.. బాగున్నారా..

జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఆదివారం ప్రారంభమైంది. ఆదివారం సెలవుదినమైనప్పటికీ వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకు చేరుకుని పింఛన్లు పంపిణీ చేశారు. అవ్వా..తాతలను పలుకరించి యోగక్షేమాలను తెలుసుకున్నారు. –సాక్షి నెట్‌వర్క్



నెల్లూరులో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్



నెల్లూరులో పింఛన్ అందజేసేందుకు చేనేత కార్మికుడు టీ గోవిందయ్య నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ నాగలక్ష్మి



కలిగిరిలో పుల్లమ్మకు నగదు ఇస్తున్న వలంటీర్ మౌనిక



సంగం : మర్రిపాడులో రమణమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ పవన్

నెల్లూరు బ్రాండ్ వరి వంగడాలు

నెల్లూరు వరి పరిశోధనా స్థానంలో నూతన వంగడాల సృష్టి

- ఇప్పటికే 28 రకాలను అందించిన శాస్త్రవేత్తలు
- తాజాగా 'ఎన్‌ఎల్‌ఆర్ 3238' రకం మార్కెట్లోకి
- జింక్ శాతం ఎక్కువగా ఉండడం ప్రత్యేకత
- నెల్లూరు మసూరి నాలుగు రాష్ట్రాల్లో అధికంగా సాగు



వరి పైరు(ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు సాగిస్తూ కొత్త రకం వరి వంగడాలను సృష్టిస్తున్నారు. ఇక్కడ 1948 నుంచి వరి వంగడాలపై పరిశోధనలు సాగిస్తుండగా, ఇప్పటి వరకు 28 రకాల కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. ప్రధానంగా 1961 నుంచి పరిశోధనలను కొత్తపుంతలు తొక్కిస్తూ కొత్త వంగడాలను రైతులకు అందించారు. ఈ వంగడాలు నెల్లూరు బ్రాండ్‌గా నిలుస్తున్నాయి.

అధిక జింక్ శాతంతో కొత్త వంగడం సృష్టి

నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గత మూడేళ్ల నుంచి ఎంతో కష్టపడి ఎన్‌ఎల్‌ఆర్ 3238 రకం కొత్త వంగడాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చారు. జింక్ శాతం అధికంగా ఉండడం ఈ వంగడం ప్రత్యేకత. సాధారణ వంగడాల్లో జింక్ 18 శాతం పీపీఎం ఉండగా, ఎన్‌ఎల్‌ఆర్ 3238లో 24 శాతం పీపీఎంగా ఉంటుందని నిర్ధారించారు. ఈ వంగడం పంట కాలం 125 నుంచి 130 రోజులు. రబీ, ఖరీఫ్ రెండు సీజన్‌ల్లోనూ సాగుకు అనుకూలం. ఇప్పటికే ఈ వంగడాన్ని మినీకిట్ల రూపంలో రైతులకు పంపిణీ చేసి సాగుచేసి విజయవంతమయ్యారు.



నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానం

తొమ్మిది వంగడాలు బహుళ ప్రాచుర్యం

నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో సృష్టించిన కొత్త వంగడాల్లో తొమ్మిది రకాలు బహుళ ప్రాచుర్యం పొందాయి. ప్రధానంగా నెల్లూరు మొలగొలకులు (ఎన్‌ఎల్‌ఆర్ 9674), నెల్లూరు పార్థీవ (ఎన్‌ఎల్‌ఆర్ 33892), నెల్లూరు మసూరి (34449), నెల్లూరు శ్వేత (ఎన్‌ఎల్‌ఆర్ 40024), నెల్లూరు భరణి (ఎన్‌ఎల్‌ఆర్ 30491), నెల్లూరు సోమశిల (ఎన్‌ఎల్‌ఆర్ 33358), నెల్లూరు ధాన్యరాశి (ఎన్‌ఎల్‌ఆర్ 3354), నెల్లూరు సోనా (ఎన్‌ఎల్‌ఆర్ 3041), నెల్లూరు స్వర్ణముఖి (ఎన్‌ఎల్‌ఆర్ 145) రకాలు అధికంగా సాగుబడిలో ఉన్నాయి.

శాస్త్రవేత్తల కృషికి హ్యాట్సాఫ్

జిల్లాలోనే కాకుండా అన్ని ప్రాంతాల రైతులతో పాటు వినియోగించే వారిని దృష్టిలో ఉంచుకుని నెల్లూరు శాస్త్రవేత్తలు కొత్త వంగడాలను సృష్టిస్తున్నారు. పూర్తిస్థాయిలో అన్ని రకాల ప్రయోగాలు పూర్తి చేసి కొత్త వంగడాలను మార్కెట్లోకి విడుదల చేసేందుకు మూడు నుంచి ఆరేళ్లకు పైగా పడుతుంది. ఎంతో నైపుణ్యం,ఓర్పుతో ఎప్పటికప్పుడు అన్ని రకాల పరీక్షలు చేస్తూ నూతన వంగడాలను అందించే శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

నెల్లూరు మసూరి నాలుగు రాష్ట్రాల్లో సాగు

నెల్లూరు శాస్త్రవేత్తలు సృష్టించిన నెల్లూరు మసూరి రకం ధాన్యం నాలుగు రాష్ట్రాల్లో సాగుచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ అక్కడక్కడా సాగు చేస్తుండడం విశేషం.

నెల్లూరు పేరు నలుమూలలా..



నెల్లూరు శాస్త్రవేత్తలు ఎన్నో రకాల కొత్త వంగడాలను రూపొందించి రైతులకు అందించారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైతులు మన శాస్త్రవేత్తలు అందించిన వాటినే ఎక్కువగా వినియోగిస్తున్నారు. కొత్త వరి వంగడాలతో నెల్లూరు పేరును నలుమూలలా విస్తరింపజేస్తున్న శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు.

–వీ చెన్నారెడ్డి, ఖాన్‌సాహెబ్‌పేట, మర్రిపాడు మండలం

నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి



జిల్లాలోని రైతుల అవసరాలకు అనుగుణంగా నూతన వంగడాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారించి పరిశోధనలు చేపడుతున్నాం. నూతన వంగడాన్ని మార్కెట్లోకి తీసుకురావాలంటే మూడు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుంది. అప్పటి వరకు అని విధాలుగా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించి విజయవంతమైతేనే మార్కెట్‌లోకి తీసుకురావడం జరుగుతుంది. దీని వెనుక ఏళ్ల తరబడి శాస్త్రవేత్తల కృషి ఉంటుంది.

–వినీత , ప్రధాన శాస్త్రవేత్త

పూర్తిస్థాయిలో పరీక్షలు



నూతన వరి వంగడాలను మార్కెట్లోకి విడుదల చేసే ముందు పూర్తిస్థాయిలో పరీక్షలు చేస్తాం. వివిధ పద్ధతుల్లో వేసి దిగుబడులు పరిశీలిస్తాం. రైతులతోనూ ప్రయోగాత్మకంగా సాగుచేయిస్తాం. ధాన్యాన్ని అనేక రకాలుగా ల్యాబ్‌ల్లో పరీక్షలు చేస్తాం. అనంతరం ముందుగా సాగుచేసిన పద్ధతిలో నిర్ధారించిన తరువాత రైతులకు అందజేస్తాం.

–లక్ష్మి, శాస్త్రవేత్త

శాస్త్రవేత్తల శ్రమ వెలకట్టలేనిది



కొత్తరకం వరి వంగడాలను రైతులకు అందించడంలో శాస్త్రవేత్తల శ్రమ వెలకట్టలేనిది. రైతులతో పాటు వినియోగించే వారిని దృష్టిలో పెట్టుకుని విత్తనాన్ని తయారు చేయడం అంత సులభం కాదు. ఏళ్ల తరబడి ప్రయోగాలు చేసి వంగడాలను సృష్టిస్తున్న శాస్త్రవేత్తలకు అభినందనలు.

–బీ భాస్కర్‌రెడ్డి, రైతు, మనుబోలు

సీనియర్ సిటిజన్లను గౌరవించడం బాధ్యత



సత్కరిస్తున్న వికాస్ మర్మత్



నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం

నెల్లూరు(బారకాసు): సీనియర్ సిటిజన్లను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఈఎస్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల, బాలాజీనగర్‌లోని కాంతమ్మ ఆశ్రమంలో కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను సత్కరించారు. ఏఈఆర్వోలు, దేవీకుమారి, నిర్మలానందబాబా, ఈడీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

- వృద్ధులను ఆదరించడం అందరి బాధ్యత అని నారాయణ దంత వైద్యకళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ కణ్ణన్ పేర్కొన్నారు. నగరంలోని నిరాశ్రయుల కేంద్రంలో గల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానాన్ని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం నృత్య కళాకారిణి వసుంధరాదేవిని సత్కరించారు. వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ వసుంధర, జయప్రకాష్, రామ్మోహన్, వేణుగోపాల్, రసూల్, శేషయ్య, శ్రీనివాసులు, మురళీమోహన్‌రాజు, వెంకటేశ్వర్లు, నూర్జహాన్‌బేగం, మాజీ కార్పొరేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చలమయ్యను సత్కరిస్తున్న ఆర్డీఓ

నెల్లూరు రూరల్: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్య్ర సమరయోధుడు చలయమ్యను నగరంలోని ఆయన నివాసంలో ఆర్డీఓ మలోల సత్కరించారు. ఆర్డీఓ కార్యాలయాధికారి మధుసూదన్‌శర్మ పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో పండ్లను కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చెన్నయ్య, ఎస్వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపో మాపో నారాయణ కూడా..



•నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జైల్లో ఉన్న చంద్రబాబును ఇటీవల మాజీ మంత్రి నారాయణ ఎందుకు కలిసివచ్చారో అందరికీ తెలుసునని, అమరావతిలో పేదల అసైన్డ్ భూములను అందరూ కలిసి కాజేసిన నేపథ్యంలో ఆయన ఏది చెబితే అదే చెప్పేందుకు ఒక అవగాహన కోసం వెళ్లి కలిశారని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ దుయ్యబట్టారు. నగరంలోని విజయమహల్‌గేట్ సమీపంలో ఉన్న ఎంసీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపోమాపో మాజీ మంత్రి నారాయణను కూడా సీఐడీ అరెస్ట్ చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. జైల్లో చంద్రబాబును కలిసి బయటకు వచ్చాక తాము వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ గురించి మాట్లాడామని నారాయణ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అమరావతిలో రూ.800 కోట్ల విలువ చేసే పేదల భూమి కాజేసిన నారాయణ సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు స్కిల్ స్కాంపై విచారణ జరుగుతోందని, భవిష్యత్‌లో ఇంకా భయంకరమైన నిజాలు బయటకొస్తాయన్నారు. గతంలో కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభంను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిన వారు, ఆయన కుటుంబం నిరసన కార్యక్రమాలు చేస్తే ఎగతాళి చేసిన వారు ఇప్పుడు అదే తరహాలో కార్యక్రమాలు చేపట్టడం చూస్తుంటే ఇది దేవుడి స్క్రిప్టే అని అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అరెస్ట్ అయితే నెల్లూరులోని టీడీపీ నాయకుల్లో ఎక్కడా బాధ కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. నగర నియోజకవర్గంలో రూ.10 కోట్లతో నూతన అర్బన్ హెల్త్‌సెంటర్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: ట్రాక్టర్‌పై వెళ్తూ జారిపడి వ్యక్తి గాయపడిన ఘటన వెంకటాచలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కసుమూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ ప్రదీప్‌కుమార్ ట్రాక్టర్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు జారిపడడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రమణారెడ్డి, అల్లు రామలింగయ్యకు నివాళి




నెల్లూరు(బృందావనం): గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో రమణారెడ్డి, అల్లు రామలింగయ్య జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. పార్కులోని ఎన్టీఆర్ కళా వేదికపై వీరి చిత్రపటాలకు మురళీ ఆర్ట్స్ చానల్, గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లాడారు. అల్లు రామలింగయ్య నటించిన తొలి చిత్రం పుట్టిల్లు నిర్మాతల్లో నెల్లూరీయులు రంజిత్‌నామ్‌దేవ్‌సింగ్, యుగంధర్ సింగ్ ఒకరు కావడం విశేషమన్నారు. గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప, పాటూరు శ్రీనివాసులు, బలరామయ్యనాయుడు.జయరామయ్య, సురేంద్ర, సత్యం, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 65
సన్నవి	: రూ. 30
పండ్లు	: రూ.7



క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు సదస్సును నిర్వహించామని వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న వారి రక్షణ కోసం సీనియర్ సిటిజన్స్ పోషణ సంక్షేమ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారని, వృద్ధులకు ఎలాంటి న్యాయ సాయం కావాలన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు పాండు పాల్గొన్నారు.

వెండి పీఠం, కవచాలకు పూజలు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కొలువైన సీతారాములు, పరివార దేవతలకు భక్తులు కానుకలుగా సమర్పించిన వెండి పీఠం, కవచాలకు విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. అనంతరం స్వామివార్లు, పరివారదేవతలకు సమర్పించారు. మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు తాతా కిషోర్‌కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(సెంట్రల్): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8, జనవరి 19, 20వ తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న బ్యాంక్ ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని అనురాగ్ హోటల్లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లర్క్, సబ్ స్టాఫ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. అధికారులు శ్రీనివాసరావు, లక్ష్మీపతిరావు, శ్రీనివాస్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథ్‌శర్మకు జ్యోతిష్య ప్రముఖ్ పురస్కారం



నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన జ్యోతిష్యుడు వేమూరు గోపీనాథ్‌శర్మ జ్యోతిష్య ప్రముఖ్ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని మేడిపల్లి ఎం కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ సంక్షేమ వేదిక తృతీయ వార్షికోత్సవం సందర్భంగా తనను సత్కరించి అవార్డును అందజేశారని ఆయన చెప్పారు.

విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సూరిబాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్ - 2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, యూఈఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రావు, జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడు హజరత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యం కావాలి

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



స్వచ్ఛత - హీ - సేవ కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి ప్రాధాన్యం కావాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛత - హీ - సేవ కార్యక్రమాన్ని నగరంలోని అన్ని డివిజన్లలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శ్రమదానం ద్వారా వివిధ ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన సమీపంలోని గణేష్ ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గంట శ్రమదానం చేస్తే దేశమంతా స్వచ్ఛంగా తయారవుతుందని చెప్పారు. అనంతరం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ.. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఘాట్‌ను శుభ్రం చేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

- సంతపేట సమీపంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత - హీ - సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీపీఎంఓ రమేష్, ఎపిడెమాలజిస్ట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల పార్కులో వాకింగ్ పాత్‌ను పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభ్రపర్చారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): పరిసరాల పరిశుభ్రతపై నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. చింతారెడ్డిపాళెం సమీపంలోని జాతీయ రహదారి నుంచి ఎన్టీఆర్ నగర్ వరకు ర్యాలీ సాగింది. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ విశ్వకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదానీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ పేర్కొన్నారు. స్వచ్ఛత - హీ - సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీని అదానీ వరల్డ్, అదానీ సైనిక్ స్కూళ్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని పలు వీధులను శుభ్రం చేశారు.

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌తో పాటు సమీప ప్రాంతాల్లో శ్రమదాన కార్యక్రమాన్ని రైల్వే అధికారులు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌తో పాటు రంగనాయకులపేట రైల్వే గేట్ ప్రాంతాల్లో దాదాపు 120 మంది ఉద్యోగులు, సిబ్బంది శ్రమదానం చేశారు. రైల్వే సూపరింటెండెంట్ కుమార్, రాజేంద్రబాబు, వంశీ, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వచ్ఛత - హీ - సేవలో భాగంగా నగరంలోని 16వ డివిజన్ జగదీష్‌నగర్‌లో గల రోడ్లను కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి శుభ్రం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సురేంద్రరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మురళీధర్‌రెడ్డి, రవికుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని విద్యుత్ భవన్ ప్రాంగణాన్ని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, అధికారులు శుభ్రపర్చారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, శేషాద్రి, బాలచంద్ర, శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్‌రెడ్డి, శేషారెడ్డి, కిరణ్, నరసింహారావు, ఏఈలు సుధాకర్, విజయ్, ప్రసాద్, విజయ్‌కుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని శిశు, సంక్షేమ శాఖ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయ ఆవరణాన్ని శుభ్రపర్చారు. శిశు సంక్షేమ, సాధికారిత అధికారి హేనాసుజన్, సీడీపీఓ అనూరాధ, బాలసదన్ సూపరింటెండెంట్ లక్ష్మీబాయి, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..



రైల్వే ఉద్యోగుల శ్రమదానం



అదానీ స్కూళ్ల ఆధ్వర్యంలో..



నారాయణ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో..



జగదీష్‌నగర్‌లో..



విద్యుత్ భవన్‌లో..

వైఎస్సార్సీపీలో సముచిత స్థానం



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి సంబంధించిన రజక సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీ నేత శ్రీకొలను సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఎంపీ సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శివసునీల్‌రెడ్డి, రాఘవేంద్ర సహకారంతో వీరు పార్టీలో చేరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నియోజకవర్గంలోని 41వ డివిజన్లో గల ఇరుగాళమ్మ సంఘంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనను ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేపట్టారు. అనంతరం వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ విజయలక్ష్మి, నేత బాబ్జి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 13వ డివిజన్లో గల గ్యాస్ గోడౌన్ వద్ద రూ.1.4 కోట్లతో నాలుగు పార్కులకు శంకుస్థాపనను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్ ఆడేందుకు వీలుగా, చిన్నారులకు టెన్నిస్ కోర్టు, వాకింగ్ ట్రాక్ తదితర వసతులను కల్పించనున్నామని వెల్లడించారు. చుట్టుపక్కల డివిజన్లలోని పార్కులను సైతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. 16వ డివిజన్లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కును భరతనాట్యం, యోగా సాధనకు అనువుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. 14వ డివిజన్లోని వేపదొరువు పార్కు పనులను పూర్తి చేస్తున్నామని, 13వ డివిజన్ వెలమవారిదిన్నె, బలిజపాళెంలోని పార్కులు పూర్తయ్యాయని వెల్లడించారు. కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ సమావేశం

నెల్లూరు సిటీ: మద్రాస్ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కళాశాలలో ఏపీపీటీడీ ఎన్ఎంయూ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. తమ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గుర్తింపునిచ్చిందని చెప్పారు. జిల్లా గౌరవాధ్యక్షుడు పట్టాభిరామిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ మోహన్, రాజేష్, పీఎస్ రెడ్డి, యల్లయ్య, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కిసాన్‌నగర్, బీవీనగర్, హరనాథపురం ప్రాంతాల్లో నివసిస్తున్న వృద్ధ కుటుంబాలకు రూ.ఆరు వేలతో పాటు నిత్యావసర సరుకులను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. నిర్వాహకుడు రమేష్, సభ్యులు కార్తికేయ, శశికిరణ్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండ్రెడ్డి రంగారెడ్డి జన్మదినం



నెల్లూరు రూరల్: విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి జన్మదిన వేడుకలను నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో పలువురు నేతలు, కార్పొరేటర్లు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు.

డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలాజీనగర్‌లోని గౌడ హాస్టల్ సెంటర్ వద్ద డీవైఎఫ్ఐ నూతన కమిటీని స్థానిక యువకులతో ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక కార్యదర్శిగా శేఖర్, అధ్యక్షుడిగా జీవ, సభ్యులుగా నాగేంద్ర, హరీష్, మహేష్ తదితరులు ఎన్నికయ్యారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేటి స్పందన రద్దు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను గాంధీ జయంతి కారణంగా రద్దు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

స్క్వే జట్టుకు శిక్షణ ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ స్థాయి స్క్వే మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న రాష్ట్ర జట్టుకు శిక్షణ శిబిరాన్ని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్ మాట్లాడారు. గోవాలో నవంబర్ ఆరు నుంచి జాతీయ పోటీలను నిర్వహించనున్నారని, 16 మంది క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. స్క్వే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఇస్మాయిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, కోచ్‌లు ఖాదర్‌బాషా, షాకీర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక లావాదేవీల విషయంలో వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చిన ఘటన నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టలోని మెక్లిన్స్ రోడ్డులో గల మీరామొహిద్దీన్ దర్గా సమీపంలో నివాసం ఉంటున్న ఇంతియాజ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఆభరణాలు చేసివ్వాలంటూ 100 గ్రాముల బంగారును అదే ప్రాంతానికి చెందిన ఇలియాజ్‌కు ఇంతియాజ్ తల్లి కొంతకాలం క్రితం ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఆయన ఇవ్వకపోవడంతో ఇటీవల బాధితులు నిలదీశారు. 20 రోజుల గడువిస్తే నగదును చెల్లిస్తామని ఇలియాజ్ బావమరిది ఖలీల్ చెప్పడంతో బాధితులకు వెళ్లిపోయారు. గడువు పూర్తయినా నగదును ఇవ్వలేదు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన జఫ్రూ అలియాస్ చిచా బాధితుల వద్దకొచ్చి.. ఖలీల్ ఇంటి డాక్యుమెంట్లను పెట్టి బంగారు తాలూకు రూ.నాలుగు లక్షలను ఇచ్చి వాటిని తీసుకెళ్తానని చెప్పారు. తాజాగా ఇంతియాజ్‌కు షాదీ మంజిల్ వద్ద జఫ్రూ తారసపడటంతో నగదు విషయాన్ని అడిగారు. దీంతో ఆగ్రహానికి గురైన జఫ్రూ అతనిపై దాడిచేసి గాయపర్చారు. అనంతరం ఇంతియాజ్ ఇంటికెళ్లగా, అక్కడికి తన అనుచరులతో వెళ్లి నానా గొడవ చేశారు. దీంతో బాధితుడు డయల్ 112కు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చిన్నబజార్ పోలీసులు చేరుకునేలోపు జఫ్రూ తన అనుచరులతో కలిసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సుధీర్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదనే ఆగ్రహంతో..

నెల్లూరు(క్రైమ్): మద్యానికి డబ్బులివ్వలేదనే కోపంతో కత్తితో అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన కోటమిట్టలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఖుద్దూస్‌నగర్‌లో నివాసం ఉంటున్న అస్లామ్ జెండావీధిలోని అన్వర్ మటన్‌షాపులో పనిచేస్తున్నారు. ఆయన తమ్ముడు సమీర్ మద్యానికి బానిసయ్యారు. మద్యానికి డబ్బులివ్వాలని అస్లామ్‌ను సమీర్ శనివారం కోరగా, లేదని ఆయన చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన సమీర్ కూరగాయలు తరిగే కత్తితో అన్నపై దాడి చేసేందుకు యత్నించారు. ఇంటి నుంచి పరుగులు తీసిన అస్లామ్‌ను సమీర్ వెంబడించాడు. షాదీమంజిల్ ఆటోస్టాండ్ వద్ద కత్తితో దాడి చేశారు. గాయపడిన అస్లామ్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ ఎస్సై సుధీర్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.